ప్రమాదాల వారసంత

• వన్‌వేపై రాకపోకలతో ప్రమాదాలు • ప్రతి వారసంత రోజు సంఘటనలు • ఎంతోమందికి గాయాలు • పట్టింపులేని అధికారులు

ముస్తాబాద్‌: వారసంత వచ్చిందంటే చాలు వాహన ఛోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వన్‌వే రహదారిపై రాకపోకలను సాగించడంతో ముస్తాబాద్‌ వారసంత వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వారసంత పక్క నుంచి వెళ్లాలంటే ప్రయాణికులు, నడచి వెళ్లేందుకు జంకుతున్నారు. ప్రధాన రహదారిపై ఏడేళ్లుగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ వారసంతకు ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు వేలాది మంది తరలివస్తారు.


ముస్తాబాద్‌లో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

ప్రమాదాలకు నిలయం

ముస్తాబాద్‌ తెలంగాణ చౌక్‌ నుంచి కొత్త బస్టాండ్‌ వరకు ప్రధాన రహదారిపై ఒకవైపు వారసంత నిర్వహిస్తున్నారు. మరోవైపు రాకపోకలను సాగిస్తున్నారు. తెలంగాణ చౌక్‌ వద్ద వ్యాపారులు తమ దుకాణాలను పెడుతున్నారు. మరోవైపు కూరగాయలకు వచ్చే జనం కూడా రోడ్డుపైనే తమ వాహనాలను పార్క్‌ చేస్తున్నారు. దీంతో సిద్దిపేట, దుబ్బాక నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. తెలంగాణ చౌక్‌ నుంచి కొత్త బస్టాండ్‌ వెళ్లే 300 మీటర్ల రహదారి వన్‌వేలోనే రాకపోకలు సాగించడంతో వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ముఖ్యంగా సాయంత్రం సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వన్‌వే ట్రాఫిక్‌లో పక్కనే ఉన్న దుకాణాల యజమానులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. అలాగే ఇతరులు కూడా పార్కింగ్‌ చేయడంతో వచ్చి పోయే వాహనాలకు స్థలం లేకుండా పోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఆదివారం ఒక్కరోజే రెండు ప్రమాదాలు జరగగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనాలు దెబ్బతిన్నాయి. యాభై మంది వరకు ఇక్కడ ప్రమాదాలకు గురై క్షతగాత్రులయ్యారు. దుబ్బాక రహదారి నుంచి వచ్చే భారీ వాహనాలు కొత్త బస్టాండ్‌ వైపునకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కావడంతో రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లి వచ్చే భక్తుల వాహనాలు పెద్ద సంఖ్యలో వస్తాయి. అలాగే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి కూడా దుకాణాలతో మూసుకుపోతోంది. కొత్త బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ అయ్యేనా?

ముస్తాబాద్‌ పోతుగల్‌ రహదారిలో ప్రస్తుతం నిత్యం మార్కెట్‌ జరుగుతుంది. ఇక్కడ ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ నిర్మించాలని మండల వాసులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. నిత్యం వారసంతకు వచ్చే వేలాది మందితో రోడ్డు కిక్కిరిసిపోగా, ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ నిర్మించాలనే డిమాండ్‌ ఎప్పటి నుంచో ఉంది. అలాగే వారసంతను విశాల ప్రదేశంలోకి మార్చినట్లైతే ట్రాఫిక్‌ సమస్య తొలగి, ప్రమాదాలు జరగకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. తహసీల్దార్‌ కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశం లేదా రత్నాలకుంట, పోతుగల్‌ రహదారిలో వారసంత నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఏదైనా ఒక ప్రదేశంలో వారసంత నిర్వహిస్తే రైతులు, వ్యాపారులతోపాటు, ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని అంటున్నారు. వారసంతలో గతంలో పోలీసులు బందోబస్తు నిర్వహించేవారు. ఇప్పుడు సిబ్బంది కొరతతో కానిస్టేబుళ్లు ఇటువైపు రావడం లేదు. అలాగే పంచాయతీ సిబ్బంది కూడా ఎవరు రాకపోకలను నియంత్రించే పని చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

మరో ప్రదేశంలో నిర్వహించాలి



వారసంతకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా పొరుగునే ఉన్న సిద్దిపేట జిల్లా ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో వస్తారు. ఇక్కడ కనీస వసతులు లేవు. సింగిల్‌వేపై రాకపోకలు సాగించడంతో ప్రతి వారం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతోమంది గాయాల పాలయ్యారు. వారసంతను మరో ప్రదేశంలోకి మార్చాలి. – గుండెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ, ముస్తాబాద్‌

ప్రధాన రహదారిపై వద్దు



సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారి ఎప్పుడు బిజీగా వుంటుంది. భారీ వాహనాల రాకపోకలు ఎక్కువ ఉంటాయి. ప్రధాన రహదారిపై వారసంత నిర్వహించొద్దు. గతంలో పంచాయతీ అధికారులకు చెప్పాం. ప్రతి వారం ప్రమాదాలు జరుగుతున్నాయి. మరో చోటికి వారసంత తరలించాలని సూచించాం. – శేఖర్‌రెడ్డి, ఎస్సై, ముస్తాబాద్‌

పంచాయతీ సిబ్బందిని పెడుతాం



వారసంత రోజు ప్రమాదాలు జరగకుండా పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. వారసంత నిర్వహణకు మరోచోటు కోసం చూస్తున్నాం. వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తాం. అటువైపు వున్న వాహనాలు తొలగించి, రోడ్డు బాగుండేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్‌

క్లుప్తంగా

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్‌

సిరిసిల్లటౌన్‌: బాలల హక్కుల పరిరక్షణ పౌరులందరి బాధ్యత అని జిల్లా చైల్డ్‌ ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌ ఎం.లక్ష్మణ్‌ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలను చంద్రంపేట జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. బాలలు జాతి సంపద వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తే, కఠిన శిక్షలు తప్పవన్నారు. బాల్య వివాహాలు నేరమని, బాలకార్మిక వ్యవస్థపై ప్రభుత్వ కఠినమైన ఆంక్షలు అమలు చేస్తుందన్నారు. పిల్లలపై దాడులు, అక్రమ రవాణా, భిక్షాటన చేసే వారి వివరాలను 1098 హెల్ప్‌లైన్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందివ్వాలని ప్రజలను కోరారు. బాలల హక్కులపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించి పిల్లల సమక్షంలో భారత ప్రధాని చాచానెహ్రూ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


వారోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్‌

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా సంక్షేమ గురుకుల కళాశాలలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్‌ కె.రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారోత్సవాలు ఈ నెల 20 వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రతిభను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ సుధాసింధు, లైబ్రేరియన్‌ వడ్లకొండ రజిత, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసిన ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు


శ్రమదానంతో పిచ్చి మొక్కల తొలగింపు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు శ్రమదానంతో పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ఆవరణలో పేరుకుపోయిన గడ్డిపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి విద్యార్థి సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం


సిరిసిల్లటౌన్‌: అంగన్‌వాడీ పాఠశాలలో..


గంభీరావుపేటలో..


వేములవాడరూరల్‌: భవిత సెంటర్‌లో..


కోనరావుపేట: కనగర్తిలో పాఠాలు బోధిస్తున్న చిన్నారి


ముస్తాబాద్‌: మాట్లాడుతున్న ఎస్సై శేఖర్‌రెడ్డి




ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో..


రుద్రంగిలో..



వీర్నపల్లి: ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు


తంగళ్లపల్లి: ఓబులాపూర్‌లో ఉపాధ్యాయులుగా విద్యార్థులు

మాజీ ప్రధాని దివంగత జవహర్‌లాల్‌ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్‌ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. సిరిసిల్ల బీవైనగర్‌ సెక్టర్‌ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, శ్రీకృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌, ఇంగ్లిష్‌ యూనియన్‌, రేయిన్‌బో, వివేకానంద విద్యానికేతన్‌, రేడియంట్‌ విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ముస్తాబాద్‌ మండలం ఆవునూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సై శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

– సిరిసిల్లటౌన్‌/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్‌/గంభీరావుపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి/కోనరావుపేట/వేములవాడరూరల్‌/రుద్రంగి/బోయినపల్లి

నియామకం

గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా ధర్మేందర్‌

రుద్రంగి: రుద్రంగి గంగపుత్ర సంఘం నూతన అధ్యక్షుడిగా దేశవేని ధర్మేందర్‌ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా చిట్టపురం భూమయ్య, కోశాధికారిగా ద్యావల రవి, ఆరుగురు కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రీవల్లి

గంభీరావుపేట: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మధుమేహ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామ విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ విజయలక్ష్మి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్‌ శ్రీవల్లి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ ధర్మపురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

గంభీరావుపేట: లయన్స్‌ క్లబ్‌ గంభీరావుపేట శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది గ్రామస్తులకు డయాబెటిస్‌, బీపీ తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, కోశాధికారి చేపూరి కిషన్‌, సభ్యులు నాగరాజుగౌడ్‌, నర్సింహారాజు, పర్శరాములు, కమలాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు


రక్తపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ నాగరమేశ్‌

వేములవాడ: వేములవాడ పట్టణంలోని మండల పరిషత్‌ ఆవరణలో మంగళవారం ఉదయం లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. డాక్టర్‌ నాగరమేశ్‌, సంపత్‌, సందీప్‌ బృందం వాకర్స్‌, స్థానికులకు రక్తపరీక్షలు నిర్వహించి, తగు సూచనలు చేశారు.

తుది దశలో ఎమ్మెల్యే కార్యాలయ భవనం


ఎమ్మెల్యే కార్యాలయ భవనం

వేములవాడరూరల్‌: ఐదేళ్లుగా కొనసాగుతున్న వేములవాడ ఎమ్మెల్యే కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కార్యాలయం ఉండాలని సీఎం కేసీఆర్‌ ఐదేళ్ల క్రితం రూ.1.25 కోట్లు కేటాయించారు. బాలనగర్‌ బైపాస్‌ రోడ్డు పక్కన నిర్మిస్తున్న ఈ భవనం కొత్త ఎమ్మెల్యే వచ్చే వరకు ప్రారంభమవుతుందా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పనులకు కేవలం రూ.50 లక్షలు మాత్రమే మంజూరైనట్లు తెలిసింది. మిగతా రూ.75 లక్షలు బిల్లు పాస్‌ అయినా, ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌ ఇబ్బంది పడుతున్నారు.

మరమ్మతు ఎప్పుడో.?



వేములవాడరూరల్‌: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. నీటి ప్రవాహం పెరగడంతో రోడ్డును కట్‌ చేసిన అధికారులు అక్కడి నుంచి నీటిని తొలగించారు. ఒక ప్రాంతం రోడ్డు బాగు చేసినప్పటికీ మరో భాగం మరమ్మతు చేయకపోవడంతో ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది వేములవాడ పట్టణం నుంచి జగిత్యాలకు వెళ్లే బైపాస్‌ రోడ్డు పరిస్థితి. ఈ రోడ్డు వెంట ప్రతిరోజు పట్టణ వాసులు, కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులతో పాటు యాత్రికులు వెళ్తుంటారు. రాత్రి సమయంలో రోడ్డు కనబడక ప్రమాదాలు కూడా జరుగుతున్నట్లు వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకుని వెంటనే రోడ్డు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఓటరు స్లిప్‌లను ప్రతీ ఓటరుకు అందజేయాలి


మాట్లాడుతున్న డీటీ శ్రీలత

చందుర్తి: ఓటరు స్లిప్‌లను ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటరుకు బీఎల్‌వోలు అందించాలని చందుర్తి డిప్యూటీ తహసీల్దార్‌ శ్రీలత కోరారు. చందుర్తి మండల పరిషత్‌ కార్యాలయంలోని మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలతో ఎన్నికల విధివిధానాలపై మంగళవారం అవగాహన కల్పించి, గ్రామాల వారీగా ఓటరు స్లిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్‌ మాట్లాడుతూ నవంబర్‌ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌ శాతాన్ని పెంచేలా బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. ఓటర్లకు ఓటరు స్లిప్‌లతో పాటు ఓటరు గైడ్‌, సీ–విజిల్‌ పాంప్లెట్‌లను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఓటరు స్లిప్‌ను పంపిణీ చేయగా, స్లిప్‌లు తీసుకున్న వారిని నుంచి సంతకాలు సేకరించాలన్నారు. సెక్టార్‌ పరిధిలో ఓటరు స్లిప్‌లు ప్రతి ఓటరుకు అందేలా సెక్టార్‌ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్‌, ఆర్‌ఐ రవి, ఐసీడీఎస్‌ సీడీపీవో ఎల్లయ్య, అన్ని గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చిత్రకథ



చీకట్లో శివారు ప్రాంతాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో శివారు ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి. సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిలో విద్యుత్‌ దీపాలు లేక ప్రయాణికులు, ప్రజలు చీకట్లో కాలం వెళ్లదీస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రజలు చీకట్లో మగ్గుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. శివారు ప్రాంతాల్లో విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

'మృగయా పురి' పుస్తకం ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ కందేపి రాణిప్రసాద్‌

సిరిసిల్లటౌన్‌: ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్‌ కందేపి రాణిప్రసాద్‌ మరో బాల సాహిత్య పుస్తకాన్ని రచించారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలోని సృజన్‌ పిల్లల హాస్పిటల్స్‌లో బాలలే ముఖ్య అతిథులుగా ఆమె కొత్త రచన పుస్తకాన్ని వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. నేటి బాలలు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని వక్తలు ఆకాంక్షించారు. డాక్టర్‌ కందేపి ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్సై నవత

వీర్నపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవత ఆధ్వర్యంలో అన్ని పార్టీల మీటింగ్‌ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీలు వారు ప్రచారం అనుమతి తీసుకొని చేయాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.